కథ

# తుఫాను

**సాదుం రమణ**



**కాసేపటి క్రితం వరకు ఆకాశం వుతికిన బట్టవలె వుండింది. 'వానరావటం, ప్రాణం పోవటం' ఎవరికి తెల్సు అన్న దాన్ని నిజం చేస్తూ వున్నట్లుండి నల్లడి మబ్బులు ఆకాశం అంతా విస్తరించాయి. మబ్బులు కమ్ముకునే విధానం చూస్తోంటే "ప్రళయం" యేదో సృష్టించేవిధంగా వున్నాయి. రైలు రాకకు సూచనగా గంట మోగినట్లు, వాన రాకకు సూచనగా వురుములు, మెరుపులు ప్రారంభమయ్యాయి.**

మేఘం గర్జించే విధానం ఆకాశాన్ని మింగేటట్లుగాను, భూమిని చీల్చేట్లున్నాయి. మెల్లగా రైలు కదిలినట్లు తువ్వరతో మొదలైన వాన కాసేపటికే వేగం అందుకుంది. అంతే క్షణాలమీద వూరు యేరైంది. ఆ వాన నీటిలో పిల్లలు పడవలు విడిచి వాటి వెనకాల పరుగెత్తుతూ కేరింతలు కొడ్తున్నారు.

బజారున పారుతున్న వాననీటిని చూసేసరికి గెటిపాటివున్న "గంజు" గుర్తుకొచ్చింది ఎర్రపురెడ్డికి.

గుర్తురావడమే ఆలస్యం. గబుక్కున బిందె, చెంబు తీసుకొని "గంజు" (రొచ్చు)ను తోడుకొని వాకిట్లో నుండి వాననీటిలో కలిపాడు.

అట్లా గాటిపాట వున్న గంజంతా బజారుకేసిపోసి, వాన నీళ్ళతో వళ్ళంతా శుభ్రం చేసుకొని యింట్లోకొచ్చాడు.

"ల్లే ఎర్రపురెడ్డిగా బయటకు రారా" అనె పిలుపు వినపడింది.

తనను ఎవరో యేదో అంటున్నారనే విషయం అర్థమయ్యేసరికి తనమీద పిడుగుపడ్డంత భయం అయింది.

ఏమీ వినపడనట్లుగా భయంతో యింట్లోనేవుండి మాటలను వింటున్నాడు. ఎర్రపురెడ్డి బయటకు పోకుండా వుండేసరికి బయటి అరుపులు మరింత ఎక్కువైనాయి.

"యాడాడిదంతా మా కొంపల సందుల్లోపోసి, దర్జాగా యింట్లో ముదుక్కొన్నావ్ "ఇదేమన్నా సంసారాలు చేసే బజారు అనుకొన్నావా లేక మీ నాయన తొగించిన మురిక్కుంటనుకొన్నావా?"

బయట గంగిరెడ్డి కేకలేస్తనాడనే విషయం ఎర్రపురెడ్డికి అర్థమైంది. అయినా తనకు, గంగిరెడ్డికి ఏనాడు చిన్నమాట తగాదా కూడ లేకపాయ. అట్లాంటిది తనమీద యెందుకింతగా కేకలేస్తాండాడో ఎర్రపురెడ్డికి అర్థంకాలేదు.

తమాయించుకొని గడపలో నిలబడి బజారువైపు బిత్తర చూపులు సారించాడు. గంగిరెడ్డి జోరున కురుస్తున్న వానలో నిలబడి తిట్టుతూ వుండటం కనిపిస్తోంది.

ఎర్రపురెడ్డి భయంతో జోరున కురుస్తున్న వానలోనే గంగిరెడ్డికి యేదో ఒకటి సర్ది చెప్పుకోవాలని పోయాడు. కాని తను చేసింది తప్పుకాదనే విషయం తనకెంత తెల్సో గంగిరెడ్డికి కూడా అంతే తెల్సు. గంగిరెడ్డి అరుపులు వింటుంటే పిడుగు పడేముందు మేఘం గర్జించునట్లనిపించి గుండె దడదడలాడుతుంది.

తనా గుంపు, గుడారాలు లేని మనిషి- 'అయినవాళ్ళున్న యిట్లాంటి విషయాల్లో వస్తారో, రారో కూడా తెలియదు. ఏదో మర్యాదకు మాట్లాడుకునే రక్త సంబంధాలు. కాని గంగిరెడ్డి విషయం వేరు. ఆయప్పకు ఒకవర్గం అండవుంది. ఒక "ఊశ" (ఈళ) వేస్తే చాలు తన కొంపను కళ్ళుమూసి, తెరిచే లోపు పీకేంత మంది వుండారు. అందుకే యివన్నీ ఆలోచించే సర్దిచెప్పుకోవాలని గంగిరెడ్డి దగ్గరకు పోయాడు.

"ఏముందిలే గంగిరెడ్డన్న వానజోరున కురుచ్చాంది. వంక వున్నట్లుంది బజారు నీళ్ళతో. నిమిట్లో పోతాయ్ ఈ గంజు నీళ్ళన్ని" సంజాయిషిగా అన్నాడు.

"పోసినోళ్ళు ఎన్నైనా చెప్తారువై.. గొడ్లుచ్చలో, మంచులుచ్చలో యెవరికి తెల్సు. గబ్బు కొడ్తాండాయా లేదా కావాల అంతే"

"వై, గేమీ మాటలతో ఎందుకులేన్నా. సూ(చూ)డు మనం మాట్లాడతాండగానే నీళ్ళన్ని యెళ్ళలూరినాయి. అంతేకదా, అయిపాయ ఏముంది"

"మాటలు నేర్చినోళ్ళు యెన్నైనా మాట్లాడ్తారు. ఈరోజు గంజుపోచ్చావ్, రేపు యింగోటి...., మిమ్మల్ని యిట్లే యిడిసి పెడ్తే."

"ఏయ్ యిడిసిపెట్టక పెరుకు తారేంరా. ఒంటిగాడని, వొంటికాలి మీద వచ్చాండావ్. 'రాండి', 'మీ' శక్తి ఎంతుందో అంటూ ఎర్రపురెడ్డి చిన్నాయన నాగిరెడ్డి వచ్చినాడు.

"నీవేమన్నా పోటు మొగోనివా లేక నెత్తిన కొమ్ములు మొల్చినాయా, మావాళ్ళంతా రాడానికి. రానీ కథేందో తేల్చుకుందాం" మీసం తిప్పుతూ, తొడలు తటుస్తూ సవాల్ విసిరాడు గంగిరెడ్డి.

"ఏందివై నీథాక్యా, యెందుకులే అని వూరుకునేకొద్ది జాచ్చి అయింది నీది, నీలీదర్ది."

"ఇదో నన్ను అన్యావోర్చుకుంటాగాని మా బాస్‌ను పళ్ళెత్తు మాటన్నవోర్సు కునేదిలేద"ని స్వామిభక్తిని ప్రదర్శించాడు గంగిరెడ్డి. వోరుకోక నువు, వాడు పొడుచ్చారేయిరా అని బూతులు తిట్టె నాగిరెడ్డి. పొడుచ్చాయో లేదో ఆయప్ప వూరికి పోయినాడు, రానీ తెలుచ్చాది అనె గంగిరెడ్డి. ఎర్రపురెడ్డి వాళ్ళ చిన్నాయన్ను ఎంత వేడుకున్న ఫలితం లేకపోయింది. మొత్తం పరిస్థితి అదుపుతప్పింది.

ఏదిఏమైనా గంగిరెడ్డి, నాగిరెడ్డిల యెత్తుగడలు ఫలించినట్లనిపించాయి. గంగిరెడ్డికి యీ గలాట యెంత వరకు దారి తీస్తుందో తెలియంది కాదు. తెలిసే అట్లా మాట్లాడినాడు. గంగిరెడ్డికి అప్పుళవాళ్ళ బెడద ఎక్కువైంది. మాసూలు లేనిది వొకటి, మంగతై మనిషిని అప్పుల్లో ముంచెత్తాయి. తీరా యిప్పుడు అప్పుల వాళ్ళతో ప్రాణం మీదికి వచ్చింది. రెండు లక్షల పైచిలుకె అప్పుతేలింది. భూమి అమ్ముదామన్న కొనేవాళ్ళు కరువైనారు. మొత్తంమీద అప్పులవాళ్ళ బెడద తప్పాలంటే తను వాళ్ళకు లెక్కైనా కట్టాలి లేక చావాలి. తన యిబ్బందులన్ని విడమర్చి కథలుకథలుగా చెప్పిన వినరు. సరికదా నీ యింట్లో ఆడోళ్ళను పడుకోబెట్టి తీర్చు అంటారు. ఇట్లైతే కాదనుకొని తనలాంటి వాళ్ళకు రాజకీయాలే శరణ్యం అని పసిగట్టినాడు. ఏదోవొక గుంపులో వుంటే భయంతో అడిగే నా కొడుకుండడు అని ఎత్తుగడ వేసినాడు. చిన్నగా ఒక గుంపు నాయకునికి దగ్గరాయ. ఆయప్ప ఎక్కడికి పోతాంటే అక్కడికి పోతాండ. అయిన అప్పులోళ్ళు సళ్ళుకోలేదు. ఇట్లైతే కాదనుకొని రగడ పెట్టాలన్న వుద్దేశానికొచ్చినాడు. అవకాశం కోసం కళ్ళుకాయలు కాసేదాకా ఎదురుచూసినాడు. ఏదోవిధంగా వూర్లో అగ్గి పెట్టాలన్న ఆలోచన మనసులో గెలుకుతాంది. ఆ ఆలోచన అట్లా నడుస్తాండగానే వానకురుస్తాంది. వాననీళ్ళకు ఎర్రపురెడ్డి గంజునీళ్ళు పోయటం చూశాడు.

ఎర్రపురెడ్డి అపోజిషన్ గ్రూపు లీడర్‌కు కొడుకు వరుస అయితాడు. ఎడంగా వున్న ఎర్రపురెడ్డిని యేదోవిధంగా గుంపులో చేర్చుకోవాలన్న ఆలోచన వాళ్ళ చిన్నాయన మనసులో వుందని తనకు ఎట్లనో తెల్సింది. అందుకే ఎర్రపురెడ్డి మీదికిపోతే వాళ్ళ చిన్నాయన యెట్లైనా వస్తాడనే "యేసన" వేసె. అందువల్లే వొకటికి రెండు మాటలు మాట్లాడె రెచ్చగొట్టె విధంగా.

మూడోమాట మాట్లాడేటప్పుడు నాగిరెడ్డి గబుక్కున వచ్చినాడు. వూరికనే రారు మహానుభావులు అన్నట్లు నాగిరెడ్డి మనసులో యింకో ఆలోచన తచ్చాడుతాంది.

అంతోయింతో లెక్కను వెనుకేసుకున్న ఎర్రపురెడ్డిని గుంపులోకి యిగ్గుకుంటే ఆర్థికంగా ఆదరవుగా వుంటాడనుకొన్నాడు.

ఎట్ల దింపాల అని దిగులు చేస్తుండగా యీరోజు గంగిరెడ్డి చేసిన గలాట నెరవేర్చబోతుంది.

కాని ఎర్రపురెడ్డికి పదురెత్తుకుంది. గోటితోపోయేది గొడ్డలిదాకా వచ్చిందని. తుంపర తుఫానుగా మారినట్లు మాటలతో పోయేది యీటెల దాకా వచ్చింది.

మొదట చిన్నాయన రావటం కొద్దిగా ధైర్యాన్నిచ్చింది. అంటే ఆయన వచ్చి తన పక్షాన కొట్లాడ్తాడని కాదు, ఏదో పెద్దమనిషికదా సర్ది చెప్తాడని.

కాని వాళ్ళ చిన్నాయన రాక అగ్గికి గాలి తోడైనట్లయిందేగాని తను అనుకున్నట్లుగా నీళ్ళుకాలె.

పాపం ఎర్రపురెడ్డి వాళ్ళ చిన్నాయన యెత్తుగడ పసిగట్టలేకపాయ.

దయ్యం పట్టినపుడే మెట్టుతో కొట్టాలనేది నాగిరెడ్డికి బాగా తెలుసు. అందుకే యిట్లన్నైతే ఎర్రపురెడ్డి పక్కకు పోయెందుకు వీలుండకూడదని. వొకటికి రెండు మాటలు గంగిరెడ్డికంటే ఎక్కువ మాట్లాడినాడు.

ఇట్లన్నైతే ఎర్రపురెడ్డితో పార్టీ (కొట్లాట) వచ్చిందంటూ పాడెనుమును పిరికినట్లుగా లెక్క గుంజచ్చని గూడుపుటాని నడిపాడు. నిన్నమొన్నటివరకు ఎర్రపురెడ్డి, నాగిరెడ్డి యెదముఖం, పెదముఖంగా వుండిరి. ఇప్పుడు ఎర్రపురెడ్డికి వాళ్ళ చిన్నాయన తనమీద వొలకబోస్తున్న

## విలువైన 'పొదుపు'



డబ్బును పొదుపు చేయడాన్ని తను పూర్తిగా సమర్థిస్తాను అంటుంది లారాదత్తా. అందాల రాణిగా, మోడల్‌గా పరిచితురాలైనా ఈ అమ్మాయి తను ఉండేది ముంబయిలో. తల్లిదండ్రులు బెంగుళూర్‌లో. ముంబయిలాంటి నగరంలో ఉన్నప్పుడు డబ్బు పట్ల జాగ్రత్తగానే వ్యవహరించాలి కదా అన్నది లారా ఆలోచన. ముంబయే కాదు గ్లామర్ ఫీల్డ్ కూడా తనను పొదుపు గురించి ఆలోచించేలా చేస్తాయంటుంది ఆమె. "గ్లామర్ ఫీల్డ్‌లో ఎక్కువకాలం కొనసాగడం ఎవరికైనా సాధ్యం కాని విషయమే. సినిమాల్లోకి వెళ్ళినా ఐదు,పది, కాదు కూడదనుకుంటే పదిహేనేళ్ళపాటు కెరీర్ ఉంటుంది. తర్వాత... పొదుపు చేసుకున్న సొమ్ము వెనకలేకపోతే ఎంతెంత ఇబ్బంది" అనే లారాదత్తాకు తల్లిదండ్రులు చిన్నప్పట్నుంచి పొదుపు గురించి నేర్పించారట. ఫెమినా మిస్‌ఇండియా పోటీలో విజేతగా నిలిచిన లారా ఈ మధ్యనే బెంగుళూరులో కొంత భూమి కొందట. కారు కొనుక్కుంది. మోడలింగ్ అసైన్‌మెంట్లు కొన్నింటికి అగ్రిమెంట్లు కుదుర్చుకుంది. అందులో కోకోకోలా, లాంజిన్స్ వంటి బ్రాండ్లు కూడా ఉన్నాయి. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో పొదుపు అంతే ముఖ్యమనే ఈ అందాల సుందరి తన సంపాదనలో ఎంతోకొంత పొదుపు చేయడం ఒక అలవాటుగా మార్చుకుందట!

"ప్రేమ" మీద విశ్వాసం అంతగా కలుగకపాయ. ఎర్రపురెడ్డి వాళ్ళ నాయన బతికున్న రోజుల్లో అంతాకూడా వుండిరి. ఎర్రపురెడ్డి వాళ్ళ నాయనకు వున్నట్లుండి పక్షవాతం వచ్చింది. పక్షవాతంతో ఆయప్ప మంచంలోనే వుండె సచ్చిందానా.

అన్న మంచంలో వున్న రోజుల్లో నాగిరెడ్డి కుటుంబ భారాన్ని నెత్తినోసుకొన్నాడు. ఇంటి పెద్దరికం వహిస్తూ మాసూలు లెక్క వెనకేసుకుండె నాగిరెడ్డి. సచ్చిం తర్వాత వొకనాడు ఎర్రపురెడ్డిని కూర్చోబెట్టుకొనె యేదో మాట్లాడాలని.

వొరె ఎర్రన్న పుట్టుకతో అన్నదమ్ములు, పెరుగుతా దాయాదులనే సామెత ఎప్పుడైనా యిన్నావా" అని అడిగె.

"విన్నాని" తలవూపాడు ఎర్రపురెడ్డి.

ఐతే చిన్నాయన ఎందుకట్లడగుతున్నాడో నాగిరెడ్డి మర్మం అర్థంకాలేదు.

"అందుకేరా మనంకూడా ఎవరి వాటాలు వాళ్ళు పంచుకుంటే బాగుంటాది. ఈరోజుకాకుంటే రేపైనా కడగా పోవాల్సినోళ్ళమే" అన్నాడు నాగిరెడ్డి.

'సరే' చిన్నాయన అన్నాడు అయోమయంగా ఎర్రపురెడ్డి. పెద్ద మనుషులు పోగు అయిరి. భాగాలు పెడ్తిరి. పంపకాలు జరిగిపాయ. ఏమిరా సరిపోయినట్లేకదా అనె నాగిరెడ్డి.

"ఆ" అనె ఎర్రపురెడ్డి.

"ఇంకో విషయం కూడ యిక్కడే చెప్తే బాగుంటాది, పెద్ద మనుషులంతా వుండారు"

"చెప్పు" అనె ఎర్రపురెడ్డి.

"ఏమీల్యా మీ నాయన జబ్బుకు రెండు లక్షల అప్పు జేసిన, నయం అయితాదని, నువ్వు పిల్లోనివని, చెప్తే భయపడతావని చెప్పకపోతి. ఇంక యీరోజు ఎవరెవరి సంసారాలు వాళ్ళయినాక చెప్పక తప్పలె. అందుకే ఈ బాకీ కూడా పంచుకుంటే బాగుంటాది" అనె నాగిరెడ్డి.

ఎర్రపురెడ్డి 'బాకీ' అంటూనే నీరుకారిపాయె.

"ఏందబ్బీ ఎర్రినాయాలని యిష్టంవచ్చినట్లు మాట్లాడతాండావ్" అంది వదిన.

అబద్ధం చెప్పేంత చావు యేమొచ్చింది వదిన, అప్పు యిచ్చినోళ్ళు యిక్కడే వుండారు అడుగు అని పెద్దమనుషులను చూపించె. ఎంత మొత్తుకున్న లాభం లేకపోయింది.

"నీవు బాకీ పంచిస్తే మాత్రం అంత లెక్క మేము యాన్నుంచి తెమ్మంటావ్. ఒకవేళ మీయన్నన్నవుంటే..." అనె వదిన.

మిమ్మల్ని లెక్కకట్టమని ఎవరు అడిగిరి. ఆవున్న భూమి ఈయప్పకే రాసీయండి. ఎట్లగో కట్ట కట్టుకొంటాడు!" అనిరి పెద్దమనుషులంతా.

"భూమి ఈడానికి కాదనె" వదిన.

ఏది ఒప్పుకోకపోతేయెట్ల. ఆయన ఈయప్పగాంగా తొండ పీకలు గుడ్లు పెట్టే దాన్ని తీసుకోడానికి ఒప్పుకున్నాడుగాని" అని నాగిరెడ్డి ఔదార్యాన్ని పొగడబట్టిరి.

అంతే లక్ష రూపాయల అప్పుకు పదికరాల భూమి పాయా.

ప్రాణంగా ప్రేమించే భర్త, భూమి పోయిన బెంగకంటే మర్ది చేసిన ద్రోహానికి మానసికంగా మంచానపడింది.

ఆమె చనిపోయేముందు ఎర్రపురెడ్డికి ప్రాణం పోసే మాటకొటి చెప్పింది.

ఒరేయ్ 'ఎర్రన్న' మీ చిన్నాయన్ను నమ్ముకుని బాగుపడినోడు లేడు. అందుకే ఎర్రపురెడ్డికి చిన్నాయన వ్యవహారం భయంమేస్తోంది.

సాయంత్రం అవుతుండగా ఎర్రపురెడ్డి ఇంటికి పదిమంది యువకులను వెనకేసుకొని నాగిరెడ్డి వచ్చినాడు.

"అయితే ఏమిసేచ్చామంటావురా" అనె నాగిరెడ్డి.

ఏమి జరిగిందని చిన్నాయన యేమన్నా చేయడానికి అనె ఎర్రపురెడ్డి. ఇంకా ఏమి జరగాల్రా. నువ్వు మాట్లాడేదంతా యిచిత్రంగా వుందె.

ఏమన్నా కయ్యాలుగా వుండి మాట్లాడ్తన్నావా కోపంగా అన్నాడు.

"ఏదో జరిగింది, సరిపోయింది. ఇప్పుడు ఎవరంతకు వాళ్ళు వుండారు"

"పార్టీలన్నీ యింతేవై ఈరోజు ఏమీలేనట్లే అనిపిస్తాయి. రేపు కాకుంటే మన్నాడు వురుకుంటారా, అన్నిమాటలు మాట్లాడిన్నా కొడుకులు"

"మనకంటే వాళ్ళు మాత్రం ఏమన్నార్లే చిన్నాయన. ఏదో ఆవేశంలో ఇంగా ఏమనాలా. నీ యాలి... అనిరి. ఈరోజు వూరకుంటే రేపు అన్నంత పనిచేయడని గ్యారంటీ ఏముంది. అంటే అన్నాడులే అని నువ్వు వూరుకొంటావేమో రోషంలేని నాకొడుకా... వంశంలో చెడపుడ్తివికదరా... నీనాయన బతికిన బతుకోందిరా, నీవు సేచ్చావుండేదేంది. నీవంటే ఆడింగల నాకొడుకువైయి ఇంట్లో నుండి బయటకురావు. కాని మేమట్లకాదె. పది చోట్ల తిరిగేవాళ్ళం. రేపొద్దున నిన్నెవరన్న ఏమన్న అంటే నీక్కాదురా అవమానం, మాకు. మానాలు, పాణాలు పోయేది మాకురా ముండమోపి అని పందెం కోడికి దమ్ముకొట్టినట్లు రోషం పోయడానికి ఎర్రపురెడ్డిని నానామాటలు అన్నాడు. చ్చా, చ్చా నిన్ను నమ్ముకొని వచ్చెయింతేకదురా, యేదో సామెత చెప్పినట్లు ఏరుదాటి తెప్ప విసిరేసినట్లు"

సరే ఎట్లా వుంటారో సూచ్చా అని విసురుగా బయటికి నడిచాడు. బజారంబడి తన 'సైన్యం'తో పోతున్న నాగిరెడ్డి, గంగిరెడ్డి మొహం వైపు కోపంగా చూస్తూ యింగవుంది ఒక్కొక్క నాకొడుక్కు" అని అయిపు చేసాడు.

ఆ మాట వెనుక ఆయప్ప ఎత్తుగడ వేరేవుంది. అంటే వీళ్ళంతా ఎదుటి గుంపోళ్ళను ఏదో చేయడానికి యేసనేసినారని అనుమానం కల్గించడానికి.

ఏయ్ వాళ్ళ కత్తులేనా దిగుబడేది. మనయి దిగవా లేక మనబాంబులేమన్న పగలనంటనాయా, మన తుపాకులు ఎగరనంటనాయా అని రెచ్చిపోయి మాట్లాడి, అక్కడవుండే తమ వాళ్ళను రెచ్చగొట్టాడు.

ఆ మాట విని గంగిరెడ్డి చావు బతుకులమీద తమ గుంపు నాయకుడు మల్లారెడ్డి ఇంటి దగ్గరకు పరుగుతీశాడు.

గంగిరెడ్డి పోయేసరికి మల్లారెడ్డి వూరికిపోయి అపుడే వచ్చినాడు.

గంగిరెడ్డి ఆత్రంగా రావటం చూసి "యేంది గంగిరెడ్డి ఎవరో తరుముతాన్నట్లు వస్తివే, ఏంది విషయం" అని అడిగాడు.

మనం ఇట్లనే వుంటే వాళ్ళు తరమడానికి సిద్ధంగా వుండారు. నీవు వూర్లోలేనిది చూసి పద్దన నన్ను, నిన్ను ఎన్నెన్ని మాటలు మాట్లాడిరి, పోనీలే అని అదంతా మర్చిపోయింటే మళ్ళీ ఇపుడు ఇంటికాడికి వచ్చి పిలిచిపోయినాడు. అని ఒకటికి రెండు చెప్పినాడు. ముందుగానే ఆ నాయకునికి ఆలోచన తక్కువ ఆవేశం ఎక్కువ. వెనుకాముందు ఆలోచించే తత్వంకాదు. దున్నపోతు ఈనిందంటే జున్ను ఎన్నాళ్ళకు అయితాది అని అడిగేరకం.

ఇప్పటి రాజకీయాలలో కేవలం మొండిధైర్యం, డబ్బు, అడ్డపుమాటలు మాట్లాడే వాళ్ళే చెలామని అవుతున్నారు.

ఏయ్ వాళ్ళ కత్తులే నా దిగుబడేది. మనయి దిగవా లేక మనబాంబులేమన్న పగలనంటనాయా, మన తుపాకులు ఎగరనంటనాయా అని రెచ్చిపోయి మాట్లాడి, అక్కడవుండే తమ వాళ్ళను రెచ్చగొట్టాడు.

"ల్లే యాడాడి యారముట్లు బయటకు తీయండ్రా. వాళ్ళు యేంది మనల్ను ఏసేది, మనల్ను వేయడానికి ముందు వాళ్ళుండేది. పాండ్రా" అని గుంపును కదిలించి తను ముందుకు నిలబడినాడు.

ఎవరో పోయి నాగిరెడ్డికి చెప్పిరి. ఆ గుంపోళ్ళంతా మన కొంపలమీదికి వస్తనారని. అంతే వీళ్ళు ఆయుధాలు పట్టుకొని మిద్దెలెక్కిరి.

క్షణాలమీద వూర్లో ఒక ప్రళయం జరిగింది. ఎర్రపురెడ్డి మొదటి ముద్దాయి అయినాడు. ఇన్నాళ్ళు అమాయకంగా వున్న ఎర్రపురెడ్డికి తన వూర్లో వుచ్చపోసిన ప్రతిచోట జాలాడి కట్టగల మేధావులున్నారని అర్థం కాలేదు.

ఏదైతేనేమి ఎర్రపురెడ్డి జైలుకు పోయినాడు.

** ** **

ఎర్రపురెడ్డి బెయిల్‌మీద ఇంటికొచ్చినాడు. జైలుకుపోయి వచ్చానాక ఎర్రపురెడ్డి "పొజీషన్" మారింది. ఇపుడు ఎర్రపురెడ్డి గుంపుకు లీడర్. వాళ్ళ చిన్నాయన కాంట్రాక్టులు చేసుకోవడానికి టౌన్లలోనే తిరుగుతున్నాడు. ఇప్పుడు ఎర్రపురెడ్డి మాటతీరు, వేషం అన్ని మారినాయి.

ఒకప్పుడు ఎర్రోడా, ఆడింగలోడా అన్న వాళ్ళంతా ఇపుడు అన్న, బాస్ అని ఇంకా రాష్ట్రంలోని వివిధ నాయకులకు పోల్చుతూ పిలుస్తున్నారు.

ఉదాహరణకు ఎర్రపురెడ్డి ఆవేశంగా మాట్లాడితే వై.ఎస్.అని, పిట్టకథలు చెప్పుతూ వ్యంగ్యంగా మాట్లాడితే మైసూరా అని, ఇలా రకరకాల సందర్భాలలో పేర్లతో పిలవటం మొదలుపెట్టినారు.

ఎర్రపురెడ్డికి ఫ్యాక్షన్ జీవితం కొత్త ప్రపంచాన్ని చూపిస్తోంది.

ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులతో పరిచయాలు ఎంతో బాగున్నాయి. ఫ్యాక్షన్ జీవితం నీటిమీద బుడగలాంటిదని తెలిసినా ఈ జీవితం ఎంతో బాగుందనిపిస్తోంది. ఒక్కరోజు బతికిన ఈ బతుకే బతకాలనే నిశ్చయానికొచ్చినాడు.

ఇటువంటి ఎర్రపురెడ్డిలు రాయలసీమలో దెగుమాళ్ళమంది వుండారు. ఇటువంటి ఎర్రపురెడ్డిలు వున్నంతవరకూ, రాయలసీమ అగ్నిగుండమై రగులుతూనే వుంటుంది.